www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 16 జూన్ 2024


5

పశ్చిమ గోదావరి



సురక్షిత తాగునీరందిస్తాం : నాయకర్

నరసాపురం: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందిస్తామని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం పట్టణంలోని రక్షిత మంచినీటి సరఫరా విభాగాన్ని, సమ్మర్ స్టోరేజి ట్యాంక్, హెడ్ వాటర్ వర్క్సును ఆయన పరిశీలించారు. అనంతరం మంచినీటి కుళాయి చెరువు చుట్టూ తిరుగుతూ చెరువు గట్టును కూడా పరిశీలించి, మున్సిపల్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ప్లాంట్స్ స్థానంలో కొత్తవి నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తోట అరుణ, బొమ్మిడి సూర్యకుమారి పాల్గొన్నారు.



కుళాయి చెరువుల వివరాలు ఆరా తీస్తున్న నాయకర్

రైతు 'చింత' తీరేనా..!



చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతుల పరిస్థితి అగమ్యగోచరం

భూములకు న్యాయమైన పరిహారం కోసం అలుపెరగని పోరాటం

పట్టించుకోని గత ప్రభుత్వం - కొత్త సర్కార్ రాకతో రైతుల్లో మళ్లీ ఆశలు

భూములను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో తీవ్ర ఇబ్బందుల్లో రైతులు

తమకు న్యాయం చేసి ప్రాజెక్టు పూర్తి చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న బాధిత రైతులకు ఇప్పటికైనా న్యాయం జరిగేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. చింతలపూడి బాధిత రైతులకు న్యాయం చేస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చిన వైసిపి అధికారంలోకి వచ్చాక పట్టించుకున్న దాఖలాల్లేవు. ఎంపీగాని, ఎంఎల్ఎగాని రైతులతో కూర్చుని మాట్లాడిన పరిస్థితీ లేకుండాపోయింది. చింతలపూడి ప్రాజెక్టులో భాగంగా కాలువ తవ్వకాల కోసం సేకరిస్తున్న భూములకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఏళ్ల తరబడి రైతులు తమ పోరాటం సాగిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. జిల్లాలో అత్యంత ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రధానమైంది. 2008లో చింతలపూడి ప్రాజెక్టును రూ.1,701 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించింది. అందుకుగాను రూ.4,909 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా వేశారు. ఇప్పటికీ భూసేకరణ పూర్తికాని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం ఒక్కటే. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరకు, ప్రభుత్వం రైతులకు ఇస్తామని చెప్పిన ధరకు పొంతన లేకపోవడమే. అప్పట్లోనే బహిరంగ మార్కెట్లో ఎకరా భూమి రూ.30 లక్షలకుపైగా పలుకుతుండగా ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.12.50 లక్షలు మాత్రమే. ఎకరా పొలం కోల్పోయిన రైతులు ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో అర ఎకరా సైతం కొనలేని పరిస్థితి నెలకొంది. అప్పట్లో పట్టిసీమ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ పరిహారం ఇచ్చారు. పట్టిసీమ ప్రాజెక్టులో రైతులకు ఇచ్చినట్లుగా తమకూ ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని రైతులు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం విన్పించుకోలేదు. దీంతో కాలువల తవ్వకాలు ఆగిపోయాయి. బలవంతంగా తవ్వకాలు సాగించేందుకు అధికారులు ప్రయత్నించినప్పటికీ రైతులు అడ్డుకున్నారు. 2019 ఎన్నికల పర్యటనలో భాగంగా చింతలపూడి వచ్చిన వైసిపి అధ్యక్షుడు జగన్ తాము అధికారంలోకి వచ్చాక చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామని ప్రకటించారు. గడిచిన ఐదేళ్లలో పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం సేకరించిన భూములను బ్లాక్‌లిస్టులో పెట్టింది. దీంతో బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. భూములు అమ్ముకోవడానికి వీల్లేకుండాపోయింది. దీంతో పిల్లల వివాహాలకు, చదువులకు, ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ఖర్చుల కోసం భూములు అమ్ముకునేందుకు సైతం వీల్లేకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట మండలాల్లో బాధిత రైతులు పెద్దఎత్తున ఉన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. జిల్లాకు చెందిన పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నారు. ఇప్పటికైనా తమ భూములకు న్యాయమైన పరిహారం ఇచ్చి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ముందుకు సాగాలని నిర్ణయించింది. చింతలపూడి రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తే ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయి.

చింతలపూడి బాధిత రైతులకు న్యాయం చేయాలి

కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించి చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు రైతులకు న్యాయం చేయాలి. గత వైసిపి ప్రభుత్వం రైతుల గోడును పట్టించుకోకుండా వదిలేసింది. ఏళ్ల తరబడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

మండుతున్న కూరగాయల ధరలు

ఘాటెక్కిన ఉల్లి, అల్లం, వెల్లుల్లి

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో, కేంద్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరాయి. అదే సమయంలో మార్కెట్లో నిత్యావసరాలు, కూరగాయల ధరలు దారుణంగా పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. సామాన్యులు ఎక్కువగా వాడే ఉల్లి ధర రోజురోజుకీ పెరుగుతోంది. ఇంకా వరదలు రాకముందే ఉల్లి ధర పెరగడంతో ఇక మహారాష్ట్రలో వరదలొస్తే సెంచరీ కొట్టడం ఖాయమని వ్యాపారులు చెబుతున్నారు. నెల రోజుల ముందు వరకు కిలో రూ.30 ఉన్న ఉల్లి ధర ప్రస్తుతం నాణ్యత బట్టి రూ.40 నుంచి రూ.50 వరకూ పలుకుతోంది. అన్ని కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్న సమయంలో సామాన్యులు ఉల్లిపాయ పులుసుతో సరిపెట్టుకునేవారు. ఇప్పుడు ఆ అవకాశమూ లేని పరిస్థితి. కందిపప్పు ధర కిలో రూ.175పైనే ఉంది. కనీసం కోడిగుడ్డుతో సరిపెట్టుకుందాం అంటే గుడ్డు రిటైల్ ధర కూడా రూ.6 పైనే ఉంది. వంట నూనె ధరలు సలసలా కాగుతున్నాయి. వర్షాకాలం వచ్చినా పచ్చిమిర్చి ధర కిలో రూ.80 నుంచి తగ్గడం లేదు. ఇక వంకాయ, బీరకాయ ధరలు వారం రోజుల ముందు వరకు కిలో రూ.40 ఉండగా ఇప్పుడు సెంచరీకి దగ్గరగా ఉన్నాయి. రూ.20 ఉన్న సొరకాయ ధర రూ.30కు పెరిగింది. కొత్తిమీర కట్ట రూ.20 నుంచి రూ.50కు పెరిగింది. మాంసాహార ధరలు సైతం దారుణంగా పెరిగాయి. వాటిలో వాడే అల్లం, వెల్లుల్లి ధరలు రెట్టింపయ్యాయి. జులై నెలాఖరు వరకు ఎటువంటి వివాహ, శుభకార్యాలు లేకపోయినా ధరలు దారుణంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు.



సాహితీ వనంలో పారిజాతం శ్రీశ్రీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సాహితీ నందన వనంలో పారిజాతం మహాకవి శ్రీశ్రీ అని, శ్రీశ్రీ ఒక వ్యక్తి కాదు, ఒక సంస్థ అని, రచనా శైలిలో ఒక ఒరవడి సృష్టించారని పలువురు వక్తలు అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్తూపం వద్ద మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమవరం ఎస్‌టిఐ అల్లూరి రవివర్మ మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా రచనా రంగంలో దేశవ్యాప్త గుర్తింపు పొందారని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ శ్రీశ్రీ 1910లో పూడిపెద్ది వారి ఇంట జన్మించిన శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడు కావడంతో ఇంటిపేరు శ్రీరంగంగా మారిందని అన్నారు. అనేక అవార్డులు సాధించారని, ఆయన మహా ప్రస్థానం ధరిత్రిపై చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. రచయిత కలిగొట్ల గోపాలశర్మ మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం ఒక ఖండ కావ్యమని, సుమారు ఏడేళ్లు మహాప్రస్థానం రచనకు పట్టిందని, సాహిత్యంలో శ్రీశ్రీ పెనుమార్పులు సృష్టించారని అన్నారు. ప్రజానాట్యమండలి సభ్యులు ఎస్‌కె.చాన్‌భాషా శ్రీశ్రీ గీతాలను అద్భుతంగా ఆలపించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, తెలుగు భాషాభివృద్ధి సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సీతారామరాజు, సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, సాగిరాజు సత్యనారాయణరాజు, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న గోపాలన్

ఉపాధి పనులకు నిధుల కోత అన్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో ఉపాధి హామీ పనులకు కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపుల్లో కోత అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ విమర్శించారు. శనివారం మండలంలోని పొలమూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న పలువురు కూలీలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో తాగునీటి వసతి లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉపాధి కార్మికులకు పని ప్రదేశాల వద్ద టెంట్లు, పనిముట్లు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే వారికి వెంటనే ప్రభుత్వమే వైద్యం చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభం

తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను త్వరలో ప్రారంభిస్తామని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక సొసైటీ రోడ్డులో ఉన్నటువంటి అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను మూసివేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన 24 గంటల్లోనే చరిత్రలో నిలిచిపోయేలా ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారన్నారు. వాటిలో అన్నా క్యాంటీన్ పున:ప్రారంభం ఫైల్‌పై సంతకం చేయడం హర్షణీయమన్నారు. త్వరలోనే అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

నేడు ఆచంట మండల సమావేశం

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా విచేస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు విధిగా సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

మారుమూల ప్రాంతాలకు 4జి సౌకర్యం

బిఎస్ఎన్ఎల్ జిఎం శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు బిఎస్ఎన్ఎల్ 4జి టెక్నాలజీ అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీనివాస్ చెప్పారు. స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని 386 టెలిఫోన్ ఎక్స్ఛేంజీల్లో 4జి ఇంటర్‌నెట్‌తోపాటు, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఏలూరు, భీమవరంల్లో 4జి సేవలు అందుబాటులోకి వచ్చాయని, మరో మూడు నెలల్లో జిల్లాలోని అన్ని మారుమూల ప్రాంతాలకు వీటిని విస్తరిస్తామని తెలిపారు. పాలకొల్లు టెలిఫోన్ కార్యాలయం వద్ద ఉన్న ముఖ్యమైన ఖాళీ స్థలాన్ని వేలం ద్వారా విక్రయించనున్నట్లు చెప్పారు. ఇది ఆసుపత్రులు, విద్యాలయాలు, ఇతర వాణిజ్య అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ ఎకరం మూడు సెంట్లు భూమి ఉందని, దీనికి రూ.11.19 కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో బిఎస్ఎన్ఎల్ డిజిఎం సోమయాజులు, ఎజిఎం ఎం.వెంకటరత్నం, పాలకొల్లు డివిజనల్ ఇంజినీర్ పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జంతు వధ చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జంతు బలులు చేసే వారికి చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని, దీనిని ప్రోత్సహించే వారికి కూడా శిక్షలు ఉంటాయని డిఎస్‌పి వి.నారాయణస్వామి రెడ్డి అన్నారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం, జిల్లా పశు సంవర్ధక శాఖ, పోలీసు, దిశా, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జంతువధ నిషేధంపై అవగాహనా ర్యాలీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి మాట్లాడుతూ సెక్షన్ 177 ప్రకారం శిక్ష పడితే జీవితకాలం అనుభవించాల్సి వస్తుందన్నారు. గోవులను అక్రమ రవాణా చేసే వారికి కూడా శిక్షలు ఉంటాయని, అక్రమ రవాణా చేసే వారిని కూడా గుర్తిస్తున్నామని తెలిపారు. దిశా పోలీసు ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలతోపాటు ప్రతి పౌరుడు కూడా ఈ జంతువధ నిషేధంలో ప్రతిఘటించాలన్నారు. పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ పండుగలను పురస్కరించుకుని గోవధ నిషేధంపై ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వీటిని వ్యతిరేకిస్తే పరిణామాలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రజల్లో సంపూర్ణ అవగాహన ఉండాలని, జంతువధ, జంతు బలులు వ్యతిరేకించడం మానవ ధర్మమని తెలిపారు. అనంతరం డిఎస్‌పి కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భీమవరం టౌన్ : అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి

నరసాపురం: బక్రీద్ సందర్భంగా జంతువధ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో పశువుల మాంసం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు వారి ఆదేశాల మేరకు జంతువధ నిమిత్తం రవాణా చేయడం నిషేధమన్నారు. ఎనిమల్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం జంతువధ నిషేధమన్నారు. ఎవరూ కూడా జంతువధ చేయరాదని, జంతువధ వధించడానికి రవాణా చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ వై.సుధాకర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

గణపవరం: జంతువధ నిషేధం అమలు జరపాలని నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్, గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు ముస్లిం సోదరులను కోరారు. శనివారం గణపవరం పోలీస్ స్టేషన్‌లో స్థానిక ముస్లిం సోదరులతో సమావేశం నిర్వహించి బక్రీద్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాంతి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

రైతులు శిక్షణను సద్వినియోగించుకోవాలి

మార్టేరు పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరిగే శిక్షణను, క్షేత్ర సందర్శనను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ కోరారు. శనివారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శిక్షణ, సందర్శన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 5, 6, 7 తేదీల్లో 1750 క్వింటాళ్ల ఎంటియు రైస్ 1318 రకాన్ని రైతులకు సరఫరా చేసామని, దానిలో సుమారు 82.5 క్వింటాళ్లు పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయ శాఖకు గ్రామీణ విత్తన పథకం కోసం సరఫరా చేసినట్టుగా తెలియజేశారు. దీనితోపాటూ ఎంటియు 3626 రకం 5.0 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాన్ని కూడా రైతులకు సరఫరా చేసామన్నారు. 2024-25 సంవత్సరం పంటకాలంలో శాస్త్రవేత్తల బృందాలను ఏర్పాటుచేసి రైతులు పొలాలను సందర్శించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగిస్తున్న నేపథ్యంలో ప్రతీ వ్యవసాయ డివిజన్‌లో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత దాళ్వాలో రైతులు ఎదుర్కొన్న తెల్లదోమ, జింక్ లోపం, బాక్టీరియా ఆకు, ఎండు తెగుళ్లపై వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డికంపోజర్‌ల వాడకం, డ్రోన్‌ల వాడకం, ఆరు తడి పద్ధతి ద్వారా వరి పెంపకం వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాలను పొలంబడిలో పరీక్షించాలని వ్యవసాయ శాఖను కోరారు. మండల వ్యవసాయ అధికారులు అడిగిన ప్రశ్నలకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు.




రైతు సుబ్బారావును సత్కరిస్తున్న శాస్త్రవేత్తలు

అభ్యుదయ రైతు నెక్కంటి సుబ్బారావుకు శాస్త్రవేత్తల సన్మానం

వరి వ్యవసాయంలో తనదైన ప్రగతి సాధించి, అనేక పురస్కారాలు పొందిన అభ్యుదయ రైతు నెక్కంటి సుబ్బారావుని శాస్త్రవేత్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొని వారి డివిజన్‌లలో ఉన్న వ్యవసాయ పరిస్థితులను తెలియజేశారు. శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమానికి విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవి.కృష్ణాజి సమన్వయకర్తగా వ్యవహరించి కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. పలు ప్రాంతాలకు చెందిన రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ప్రభాకర్ మాస్టార్




కలెక్టర్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన ప్రభాకరరావు

ప్రజాశక్తి - ఆకివీడు

ఎందరికో ఆదర్శప్రాయుడు, మరెందరికో జీవిత మార్గాన్ని చూపించిన మహా మనిషి ప్రభాకర రావు మాస్టారు. ఎన్నో జీవితాలకు ప్రాణదాతగా, ఎందరో విద్యార్థులకు విద్యాదాతగా, మార్గదర్శకుడిగా, మరెందరికో జీవన ప్రగతిగా నిలిచిన వ్యక్తి చందన ప్రభాకరరావు. ఆయన మరణంతో ఎన్నో గొంతులు మూగబోయాయి. మరెందరో తమ జీవితాలకు గమ్యం ఏమిటో తెలియక ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత సాధారణ కుటుంబంలో జన్మించిన చందన ప్రభాకరరావు డిగ్రీ పాసైన అనంతరం ఉద్యోగం వేటలో అలిసిపోయి చిన్న వ్యాపారం ప్రారంభించారు. అది సక్రమంగానే సాగినా సంతృప్తి చెందని ఆయన అనుకోని అవకాశంగా వచ్చిన అన్నామలై విశ్వవిద్యాలయం కరెస్పాండెన్స్ బిఇడి కట్టి, చదివి పాసై ఉపాధ్యాయ రంగంలో ప్రవేశించారు. 2002లో డిఎస్‌సి ద్వారా ఎంపికై మండలంలోని ఉపాధ్యాయ జీవితం ప్రారంభించారు. తనకున్న విద్యని విద్యార్థులకు బోధించడంలో సంతృప్తి చెందిన ఆయన విద్య అందుకోలేని వారిని చూసి తపనపడ్డారు. పాఠశాలకు చేరుకోలేని వారి స్థాయి కోసం వారి దగ్గరకు వెళ్లి పాఠాలు చెప్పారు. అటువంటి వారిని పాఠశాలలో చేర్చేందుకు కావలసిన ఆర్థిక స్థితిని సమకూర్చాలనే భావన ఆయనలో కలిగింది. ఆయనకు కలిగిన సంపాదనలో కొంత భాగాన్ని వారి కోసం కేటాయించారు. అయినా ఆయన తపన తీరలేదు. ఆర్థికంగా స్థిరపడిన కొద్ది మంది యువకులను సేకరించారు. 'ప్రభ ఉజ్వల్ భారతీయ విద్యా ఫౌండేషన్' పేరుతో ఒక సేవా సంస్థను ప్రారంభించారు. తనకు పరిచయం ఉన్న వారితో పాటు అప్పటికే తన ద్వారా జీవితంలో స్థిరపడిన వారిని, మరికొందరు ఆర్థిక ఉన్నత స్థితి కలిగిన వారిని తనకు మార్గంగా ఎంచుకున్నారు. ఒక్కొక్కరిని ఒక్కొక్క విద్యార్థికి స్పాన్సర్ చేయించారు. అలా ప్రతి ఏటా తన ట్రస్ట్ ద్వారా అనేకమంది విద్యార్థులకు విద్యాబోధన కలిగించే అవకాశం కల్పించారు.

డిగ్రీ పాస్ అయ్యే వరకు విద్యార్థుల్ని తయారుచేసి అక్కడితో వారిని వదిలేయక జీవితంలో స్థిరపడే వరకు వెంట నడిచారు. ఆ విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరైయ్యేందుకు తన సొంత ఖర్చులతో వారికి తర్ఫీదు ఇచ్చి తయారు చేశారు. ఎందరో ఔత్సాహికులను పోటీ పరీక్షలకు సిద్ధం చేశారు. మరికొందరు ఔత్సాహికులు సివిల్ సర్వీసులో కూడా ఆయన ద్వారా హాజరయ్యారు. ఇటీవల ఒక విద్యార్థి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్‌లో ఆయన ద్వారా ఎంపిక అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఇదిలా ఉన్న దశలో అదే ప్రాంతంలో తలసేమియా వ్యాధిగ్రస్తులు పడుతున్న బాధలు ఆయన కంటపడ్డాయి. ఆ పరిస్థితిలు ఆయన మనసును కరిగించాయి. దీంతో రక్తదాతల సేకరణ ప్రారంభించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక రక్తదాన శిబిరాలు నిర్వహించారు. అనేక మందికి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ పాఠశాలలకు, విద్యార్థులకు అవసరమైన వసతులు అందించడంలో ఆయన ముందడుగు వేశారు. పలువురు దాతలను ఒప్పించి వారి ద్వారా పాఠశాలలకు కావలసిన సామాగ్రి, సహాయ సహకారాలు అందించారు. అనేక పాఠశాలలకు ప్రభాకరరావు ఇకలేరని విషయం తెలియడంతో ఇక తమ సమస్యలు తీరేదెలా అనే ప్రశ్నలు వారిలో తలెత్తాయంటే ప్రభాకర రావు సేవల స్థాయి అర్థమవుతుంది. ఇవన్నీ ఇలా ఉన్నా పాఠశాలను ఆయన ఏనాడు నిర్లక్ష్యం చేయలేదు. ఆయన పనిచేసే పాఠశాల విద్యార్థులు ఎప్పుడూ మండలంలో ఉన్నత స్థానంలోనే ఉంటారు. ఆయన విద్యార్థులు అగ్రభాగంలో నిలవడం సర్వసాధారణం. ఆ దిశగానే ఆయన చెప్పిన పాఠాలు ప్రత్యక్షంగా విన్న కలెక్టర్ ప్రశాంతి స్వయంగా ఆయనను జిల్లా అవార్డుకు ఎంపిక చేయడం గమనార్హం. విద్యా బోధన, సామాజిక సేవ, సామాజిక సమస్యల పరిష్కారం, ఆరోగ్య పరిరక్షణ, జీవన ప్రధాత ఇవి ఆయన లక్షణాలు. ఇన్ని సేవా తత్పర్థులు కలిగిన ప్రభాకరరావు ఇటీవల కొంత కాలం క్రితం అనారోగ్యానికి గురై బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. చేయించుకున్న మూడు నెలలకే ఆయన జీవితం ఈనెల ఆరవ తేదీన ముగిసిపోయింది. ఆయన లేమి ఎందరో విద్యార్థులు, అనారోగ్యవంతులకు దారి చూపేదెవరో వేచి చూడాలి.



ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెంటపాడు

ఉపాధి కూలీలకు బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండెల్లి సోమరాజు అన్నారు. శనివారం ఉపాధి హామీ పర్యటనలో భాగంగా మండలంలోని పెంటపాడు, రావిపాడు గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలు గత ఆరువారాల నుంచి వేతనాలు రాలేదని ఆందోళన పడ్డారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబురావు మాట్లాడుతూ వామపక్ష పార్టీలు పోరాటఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని నీరుగార్చడం, నిధులు తగ్గించడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. తక్షణమే ఉపాధి హామీ చట్టానికి కొత్త ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలు తక్షణమే విడుదల చేసి కూలీలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోగంటి వేణుగోపాలస్వామి, వెంకటరమణ, బెల్లంకొండ వెంకటరావు పాల్గొన్నారు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

నాయకర్‌ను కలిసిన గ్రంథాలయ అధికారిణి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ను శనివారం గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయ అధికారిణి కెజెఎస్ఎల్.కుమారి, గ్రంథ పాఠకులు కలిసి అభినందనలు తెలిపారు. గ్రంథాలయమునకు సంబంధించిన వివిధ సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకువచ్చారు. అద్దె భవనంలో ఇరుకుగా గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నామని పాఠకులకు చాలా అసౌకర్యం ఉందన్నారు. రైల్వే స్టేషన్ రోడ్ లోని కాటన్ పార్క్‌లో, బేస్మెంట్ లెవెల్‌లో అసంపూర్ణంగా నిలిచిపోయిన గ్రంథాలయ శాశ్వత భవనాన్ని త్వరలో పూర్తి చేయుటకు సహకరించాలని కోరారు. సిబ్బంది కొరత ఉన్న గ్రంథాలయంలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించుటకు సహాయ సహకారాలను అందించాలని ఎంఎల్ఎకి వినతిని అందిచారు. నాయకర్ తగు చర్యలు తీసుకుంటానని, తాను కూడా గ్రంథాలయం సందర్శిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీడర్స్ ఫారం అధ్యక్షులు సుధీర్ మోహన్, సభ్యులు రంగినీడి సుబ్బారావు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న 68 సంవత్సరాల వృద్ధుడికి పాలకొల్లు మానవతా సంస్థ తరపున రూ.15 వేల సాయం అందజేశారు. మానవత సభ్యుడు సిద్దాని సందీప్ రూ.5 వేలు, పలువురు సభ్యులు అందించిన మొత్తాన్ని కలుపుకొని రూ.15 వేలు స్థానిక బ్రాడి పేటకు చెందిన జి.సుబ్రహ్మణ్యం అనే వృద్ధుడికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సిద్ధాని బాల శంకరమల్లేశ్వరరావు, బొక్కా గంగాధరరావు, బోళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలకు జగన్ మంచి చేశారు : కొట్టు

తాడేపల్లిగూడెం: కౌన్సిలర్‌గా గెలవలేని వ్యక్తులు స్థాయికి మించి జబ్బలు చరుచుకుంటున్నారని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. శనివారం తాడేపల్లిగూడెం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కూటమికి స్పష్టమైన మెజార్టీ వచ్చిందన్నారు. రాజ్యాగం మీద మాకు పూర్తి విశ్వాసం ఉందని, ప్రజలకు మంచి చేయాలని చూసే నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. 2019లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చామన్నారు. చరిత్రలో తన పేరు నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంపత్ కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

బాబ్జి సేవలు అభినందనీయం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలో గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన అన్నా క్యాంటీన్ టిడిపి సామాన్య కార్యకర్తల సహాయ సహకారాలతో 84 వారాలపాటు ప్రతి మంగళవారం నడిపించిన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి సేవలను ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. అధికారం చేపట్టిన వెంటనే మెగా డిఎస్‌సి, భూ పరిరక్షణ చట్టం, వృద్ధులకు పెన్షన్, అన్న క్యాంటీన్, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్మెంట్‌పై సంతకాలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శనివారం టిడిపి ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో తాలూకా ఆఫీస్ సెంటర్‌లోని అన్నా క్యాంటీన్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పోతుల అన్నవరం, టిడిపి పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, గొర్రెల శ్రీధర్ పాల్గొన్నారు.

విప్లవ కవి శ్రీశ్రీకి నివాళులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

శ్రమజీవుల అభ్యున్నతి కోసం, అసమానతలు లేని, దోపిడీ లేని వ్యవస్థ కోసం తుదిశ్వాస వరకు పరితపించిన విప్లవ కవి శ్రీశ్రీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతిని భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సిపిఐ అధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ సినీ, విప్లవ, అభ్యుదయ రచయితగా, కవిగా ఉన్నత స్థానంలో నిలిచారని కొనియాడారు. రాజు మరణిస్తే శిలా విగ్రహం రూపంలో, కవి మరణిస్తే ప్రజల నాలుకపై నిలుస్తారన్న నానుడి శ్రీశ్రీ ఉదాహరణని కోనాల ప్రశంసించారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ విప్లవ కవి శ్రీశ్రీ చిరస్మరణీయుడని, సమ సమాజం కోసం వివక్షత లేని సమాజం కోసం, సోషలిస్టు రాజ్యం కోసం పరితపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

తణుకు: 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి, సంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన విప్లవ కవి, అభ్యుదయ భావాలతో జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైతాళికుడు శ్రీశ్రీ అని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మెన్ పి.దక్షిణామూర్తి అన్నారు. శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు.

ఎన్నికల అలవెన్స్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు ఏ పనులు చెబితే ఆ పనులు తూచా తప్పకుండా అమలు చేసిన గ్రామ రెవెన్యూ సహాయకులకు ఇప్పటివరకు ఎన్నికల అలవెన్స్ ఇవ్వకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సిఐటియు అనుబంధం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మాణిక్యాలరావు అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటింగ్ యంత్రాల లోడింగ్ అన్ లోడింగ్ దగ్గర నుంచి, పోలింగ్ బూతులు, కౌంటింగ్, అధికారులకు సహకారంగా అన్ని రకాల విధులు నిర్వహించిన గ్రామ రెవెన్యూ సహాయకులకు ఎన్నికల నిమిత్తం ఇవ్వాల్సిన అలవెన్స్ తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

తొలగించిన వృద్ధుల పింఛన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - ఆకివీడు

వృద్ధులు, వికలాంగులకు గత ప్రభుత్వం అక్రమంగా తొలగించిన పింఛన్లను కొత్త ప్రభుత్వం పునరుద్ధరించాలని వృద్ధుల సంక్షేమ సంఘం ఆకివీడు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బిలి బంగార్రాజు, అడపా సుబ్బారావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈనెల 15 వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవ సందర్భంగా శనివారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేశ్వర్ల సర్వార్ కాటన్ మండల వృద్ధుల సంక్షేమ సంఘం తరఫున వినతి పత్రం అందజేశారు.

తణుకు: వృద్ధులు ఎంతో ఆరోగ్యంగా, ఆనందంగా, భద్రతతో జీవిస్తున్నప్పుడే ఉత్తమ సమాజానికి కొలమానం అవుతుందని, దురదృష్టవశాత్తు మన సమాజం ఈ విషయంలో విఫల వ్యవస్థగా రూపొందుతోందని ప్రముఖ సామాజిక వేత్త డివివిఎస్ వర్మ అన్నారు. శనివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం నిర్వహించారు.

అక్రమ కట్టడాలపై చర్యలు

ప్రజాశక్తి -నరసాపురం

నరసాపురం పట్టణం 17వ వార్డు మెయిన్‌రోడ్ వారి వీధికి చెందిన అబ్బరాజు సీతామహాంజనేయ మూర్తి 2021లో అనధికారికంగా మొదటి అంతస్తు నిర్మించారు. దీనిపై పట్టణ ప్రణాళిక కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. శనివారం అడిషనల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) నరసాపురం వారు రూ.1,78,903 అపరాధ రుసుము విధించారని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పోడూరు

పాలకొల్లు-మార్టేరు ప్రధాన రహదారిపై లారీని ప్రయివేట్ సంస్థ అధీనంలో చెందిన పాఠశాల బస్సు శనివారం సాయంత్రం వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలకొల్లు నుంచి మార్టేరు వైపు విద్యార్థులను ఇంటి వద్ద దించేందుకు వస్తుండగా పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి అదే క్రమంలో వెళ్తున్న లారీని ఢీకొంది ప్రయత్నంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం అద్దాలు పగిలింది. బస్సులోని విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. దీనిపై ఏ విధమైన సమాచారం అందలేదని ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లీషు మీడియం విద్యను అందిచడమే లక్ష్యంగా..

శారదా ఇంగ్లీషు మీడియం స్కూల్ స్థాపన

డైరెక్టర్ వి.వంశీకృష్ణ



శారదా స్కూల్



ప్రజాశక్తి - ఆకివీడు

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో తాము 1987వ సంవత్సరంలో శారదా ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్‌ను స్థాపించామని, క్రమంగా ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పాఠశాలను శారదా హైస్కూల్ (ఇంగ్లీష్ మీడియం)గా మార్చమని డైరెక్టర్ వి.వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ ప్రజాశక్తితో మాట్లాడుతూ 1990వ సంవత్సరం నుంచి తమ పాఠశాల నుంచి పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవడం మొదలైందన్నారు. 1987వ సంవత్సరంలో 15 మంది విద్యార్థులతో, పది మంది సిబ్బందితో ఆనాడు తన మామ కొప్పాక చలపతిరావు ఈ పాఠశాలను స్థాపించారన్నారు. 2013వ సంవత్సరం నాటికి ప్రభుత్వ గుర్తింపు పొందాలన్న నిబంధన మేరకు గుర్తింపు పొందామని చెప్పారు. ఇప్పటి వరకు తమ పాఠశాల నుంచి 33 బ్యాచ్‌లు, 1700 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. సగటున 97 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, 10 బై 10 గ్రేడ్ సాధించి అత్యున్నత స్థాయిలో తమ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. తమ పాఠశాలలో విద్యతో పాటు భవిష్యత్తులో విద్యార్థులు జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన సాంకేతిక ప్రజ్ఞ పాఠం నేర్పిస్తున్నామన్నారు అదే విధానంలో 30 సంవత్సరాలుగా తమ పాఠశాలలో విద్యార్థులకు చదివిన చదువును రూపంగా మలిచే విధానం నేర్పామన్నారు. ఆ విధానంలోనే ప్రతి సంవత్సరం సంవత్సరాంతంలో విద్యార్థులకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఎన్నో పాఠశాలలకు, ఎందరికో విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిందని అధికారులు చెప్పేవారన్నారు. ఆ దిశలోనే తమ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌కు 2014లో రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి వచ్చిందన్నారు. ఆ సమయంలో తమ పాఠశాలకు 4 ఇన్స్‌పైర్ అవార్డ్స్, జిల్లా సైన్స్ కాంగ్రెస్‌కు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. నాట్(నేషనల్ ఆప్టిట్యూడ్ ఎగ్జామ్స్)లో తమ విద్యార్థులు 18 మందికి అత్యుత్తమ ర్యాంకులు వచ్చాయన్నారు. దేశంలోనే ఆరవ ర్యాంకు సాధించారని తెలిపారు. 2018వ సంవత్సరం నుంచి(కరోనా మినహా) ప్రతి సంవత్సరం తమ పాఠశాల నుంచి ఎపిఆర్‌జెసికి వరుసగా నేటి వరకూ విద్యార్థులు ఎంపికవుతున్నారన్నారు. 2020వ సంవత్సరంలో తమ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి బయటకు వెళ్లిన విద్యార్థి ఐఐటిలో ఎంపికయ్యారన్నారు. అదే సంవత్సరంలో మరో విద్యార్థి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారని తెలిపారు.

వీటితోపాటు తమ విద్యార్థులకు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా తర్ఫీదు ఇస్తున్నామని తెలిపారు. 2020వ సంవత్సరంలో 14 సంవత్సరాల లోపు జాతీయ వాలీబాల్ టీంకు తమ పాఠశాల నుంచి నిమ్మల వంశీ ఎంపికయ్యాడన్నారు. ప్రస్తుతం ఆ విద్యార్థి కేంద్ర ప్రభుత్వ క్రీడా శిక్షణ కేంద్రంలో శిక్షకుడిగా పనిచేస్తున్నాడని తెలియజేశారు. 2017-18లో జోనల్ స్థాయిలో తమ విద్యార్థులు కబడీలో ప్రథమ స్థానం సాధించారన్నారు. అదే సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అందించిన ప్రయివేటు పాఠశాలల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను పాఠశాలకు చెందిన బి.శివరాం, వేమూరి వెంకట శివరామశాస్త్రి(రాంబాబు), ఎన్.సుధారాణి, ఎంవి.త్రినాధులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారని చెప్పారు. తమ పాఠశాలలో బోధనతో సమానంగా విద్యార్థుల్లో స్వయం సృజనాత్మకతను వెలికి తీసే విధానం అమలు చేస్తున్నామన్నారు. బొమ్మలు చూపించి కథలు రాయించడం, పాఠాలు, కథలు చెప్పి వాటికి అనుగుణంగా చిత్రాలు గీయించడం నేర్పిస్తున్నామన్నారు. ఈ విధానంలో పిల్లల స్వయం శక్తి పెరుగుతుందన్నారు. వీటితో పాటు విద్యార్థులకు కలల పట్ల ఉన్న ఆసక్తి మేరకు పాటలు, ఏకాంకికలు, నృత్యాలతో పాటు భగవద్గీత, కరాటేలలో కూడా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ విధానంలో విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, ప్రస్తుతం తమ పాఠశాలలో 1200 మంది విద్యార్థులు 65 మంది సిబ్బంది ఉన్నారని వంశీకృష్ణ తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - ఉండి

అంగన్వాడీలో అందించే ప్రతి సేవను చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఆకివీడు సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.మేరి అన్నారు. శనివారం ఉండి మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే.. అంగన్వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పి.మేరీ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం నుంచి ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని అన్నారు. చిన్నారులను అంగన్వాడీలో చేర్పించడం వల్ల చిన్నారులకు ఆటపాటలతో విద్యను నేర్పించడం జరుగుతుందని, వారికి ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్వాడీలకు పంపించడం వల్ల తేలికగా ఓనమాలు నేర్చుకోవడం జరుగుతుందని ఐసిడిఎస్ ఆకివీడు సెక్టార్ ప్రాజెక్ట్ అధికారిని వాణి విజయరత్నం అన్నారు. అంగన్వాడీ కేంద్రంలో విద్యను అభ్యసించి ప్రాథమిక పాఠశాల స్థాయికి వెళ్లే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు శ్యాం కుమార్, అంగన్వాడీ కార్యకర్త పద్మశామల, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.


ఉండి:గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

కాళ్ల: మూడు సంవత్సరాలు నిండిన పిల్లల్ని అంగన్వాడీలో చేర్పించాలని తల్లులకు చెప్పామని అంగన్వాడీ సూపర్‌వైజర్ సూర్య కుమారి అన్నారు. పెద అమిరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ ప్రాథమిక పాఠశాల్లో చేర్పించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెనుగొండ: అంగన్వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలు దాటిన చిన్నారులకు గ్రాడ్యుకేషన్ డే నిర్వహించారు. ఐసిడిఎస్ అధికారి ఎం.విజయ కుమారి మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ-1, ప్రీ ప్రైమరీ-2 పూర్తి చేసుకుని ఒకటో తరగతికి ప్రమోట్ అయిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెనుగొండ సర్పంచి నక్క శ్యామలసోని మాట్లాడుతూ చిన్నారులకు విద్యాబోధన అందించడంలో అంగన్వాడీ సిబ్బంది, ప్రత్యేకంగా శ్రద్ధ వహించిన టీచర్లను అభినందించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగా మూడో సంవత్సరం దాటిన పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో జాయిన్ చేయాలని, అంగన్వాడీలో ఆటలు, పాటలు నిర్వహిస్తామని టీచర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, డబ్ల్యు యుపిఎస్ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి సిడిపిఒ కె.సరళ తెలిపారు. శనివారం భీమవరం మండలంలోని రాయలం, ఎల్‌విఎన్ పురం, యనమదుర్రు, దిసుమర్రు గ్రామాలలో ఘనంగా గ్రాడ్యుకేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అనిల్ కుమార్, బేబీస్ సరోజిని, టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

మొగల్తూరు : కాశీపట్నం తూర్పు గ్రామ పంచాయతీ పరిధిలో అంగన్వాడీ సెంటర్లలో గ్రాడ్యుయేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ విద్యను అంగన్‌వాడీలో పూర్తి చేసుకొని 1వ తరగతిలో చేరే పిల్లలకు గ్రామ పెద్దల చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు కె.సారమ్మ, కె.సరోజిని, ఎం.గౌతమి పాల్గొన్నారు.



రంగసాయిని అభినందిస్తున్న జెసి

ఉత్తమ బ్లడ్ డొనేషన్ మోటివేటర్‌గా రంగసాయి

భీమవరం టౌన్: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా భీమవరం పట్టణం పరిసర ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి, విద్యార్థులను, యువకులను ప్రోత్సహిస్తూ రక్త దాతలుగా చేస్తున్న శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయికి ఉత్తమ బ్లడ్ డొనేషన్ మోటివేటర్, బెస్ట్ సర్వీస్ అవార్డును జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అందజేశారు. శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం శాఖ తరపున, జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య చేతుల మీదగా ఉత్తమ బ్లడ్ డొనేషన్ మోటివేటర్, బెస్ట్ సర్వీస్ అవార్డును అందుకున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఛైర్మన్ పిఎస్.రామభద్రిరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ భాను నాయక్‌ల సమక్షంలో ఈ అవార్డును అందించారని రంగసాయి తెలిపారు. జెసి ప్రవీణ్ ఆదిత్య ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నారని రంగసాయి తెలిపారు.

ఎంఎల్ఎ రాధాకృష్ణను కలిసిన ఉపాధ్యాయ సంఘం నేతలు

తణుకు: తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గం శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో అభివృద్ధి పథంలో నడవడానికి, విద్యారంగ సమస్యలు, ప్రధానోపాధ్యాయ సమస్యలు పరిష్కరించడానికి పాటు పడాలని కోరగా రాధాకృష్ణ సానుకూల స్పందన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నేలపాటి వెంకటరమణ, డిఆర్‌వి సత్యనారాయణ పాల్గొన్నారు.

యుటిఎఫ్ డివిజన్ ఇరగవరం, అత్తిలి, తణుకు అర్బన్, రూరల్ కమిటీ ఉపాధ్యాయులు శనివారం ఆరిమిల్లి రాధాకృష్ణను కలిసి అభినందనలు తెలియజేశారు.

చదువుకు పేదరికం అడ్డు రాకూడదు

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు



అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని, నిరుపేద విద్యార్థులు మరింత విద్య అభ్యసించేందుకు పేదరికం అడ్డు కాకూడదని తణుకు ఎంఎల్ఎ అరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం కృష్ణ బలిజ సేవాసమితి ఆధ్వర్యంలో తణుకులో నిరుపేద కుటుంబం ఇబ్బంది పడుతుందని మిత్రుడు ద్వారా సమాచారం అందుకుని, తణుకు వెళ్లి తణుకు టిడిపి ఎంఎల్ఎ అరిమిల్లి రాధాకృష్ణ క్యాంపు కార్యాలయంలో గంటా త్రిమూర్తులు సౌజన్యంతో ఎండమాని గౌరీ కుమారులు ఏడో తరగతి, రెండో తరగతి చదువుతున్న చంద్రమౌళి సాయి మందన్, అమరేశ్వర్‌కు రూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని ఎంఎల్ఎ రాధాకృష్ణ చేతుల మీదుగా అందించారు. ఎంఎల్ఎ రాధాకృష్ణ దాత త్రిమూర్తులను అభినందించారు. గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరం ప్రారంభమైందని, చదువుకి పేదరికం అడ్డు రాకూడదని, ప్రతి విద్యార్థి చక్కగా చదువుకోవాలని, చదువుకునే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి శ్రీనివాసరావు, విన్నకోట వినయ్, నేదునూరి గంగాధర తిలక్, మద్దుల సాయిరాం, కాపా అమర్ బాబు, గొలగాని దుర్గాప్రసాద్, గొలగాని రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ


తాడేపల్లిగూడెంలో

తాడేపల్లిగూడెం: ఎంఎల్ఏగా ఎన్నికైన తర్వాత తన తొలి అధికారిక కార్యక్రమం విద్యార్థుల పుస్తక పంపిణీ ద్వారా ప్రారంభం కావడం చాలా ఆనందాన్ని ఇచ్చిందని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పెంటపాడు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యార్థుల పుస్తక పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలనేవి ఎన్నికల వరకు మాత్రమేనని గ్రామస్థాయి నుంచి విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వటానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. టిడిపి నాయకులు దాసరి అప్పన్న పాల్గొన్నారు.

తణుకు: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతమైన శిఖరాలకు చేరుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం స్థానిక తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జాస్తి సీతామహాలక్ష్మి బాలి కోన్నత పాఠశాల(గర్ల్స్ హై స్కూల్)లో విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేశారు. అనంతరం బాలిక ఉన్నత పాఠశాల ఆడిటోరియం పనులను పరిశీలించారు.

గణపవరం: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను అందుకొని విద్యాభివృద్ధి చెందాలని ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు అన్నారు. శనివారం గణపవరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో స్టూడెంట్ కిట్స్‌లో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ములో ఏడు హై స్కూళ్లకి చెందిన ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం : వేములదీవి గ్రామంలో కాపులకొడప జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యా సామాగ్రి కిట్లు నరసాపురం నియోజకవర్గ ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పంపిణీ చేశారు.

అన్నా క్యాంటీన్ పున: ప్రారంభిస్తాం

ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

అన్నా క్యాంటీన్ నరసాపురంలో ప్రారంభిస్తామని, ఎక్కడైతే అన్నా క్యాంటీన్ ఉందో అదే ప్రాంతంలో పున: ప్రారంభిస్తామని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ తెలిపారు. సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేపట్టిన తర్వాత గురువారం మొదటి ఫైల్‌పై సంతకాలు చేపట్టారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన అన్నా క్యాంటీన్ పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో ఇప్పటికే పలిచోట్ల అన్నా క్యాంటీన్‌లు ప్రారంభించారు. తాజాగా శనివారం నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కుళాయి చెరువు పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు అన్నా క్యాంటీన్‌లో ఉన్న సర్కిల్ కార్యాలయం ఖాళీ చేయిస్తామని ఆయన తెలిపారు. నరసాపురం-మొగల్తూరు రోడ్‌లోని 216 జాతీయ రహదారిని ఆనుకుని సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో నరసాపురం పట్టణ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం ఉండేది. శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కోల్పోతుందో తెలియక పోలీసు సిబ్బంది బిక్కుబిక్కుమంటూ ఆ కార్యాలయంలో విధులు నిర్వహించేవారు. అప్పట్లో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారులు ఈ కార్యాలయాన్ని స్టీమర్ రోడ్డులో అన్నా క్యాంటీన్‌లో రూరల్ సర్కిల్ కార్యాలయం, మీ సేవ ఉండే బిల్డింగ్‌లను రీమోడలింగ్ చేయించి పట్టణ పోలీస్ స్టేషన్‌ను తరలించారు. ఇంతవరకూ బాగేనే ఉంది. ఇప్పుడు అన్నా క్యాంటీన్ తెరపైకి రావడంతో మళ్లీ రూరల్ సర్కిల్ కార్యాలయంను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టిడిపి ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్‌ను స్టీమర్ రోడ్డులో పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు హయాంలో నిర్మించి ప్రారంభించారు. గత ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్ నిలిచిపోయాయి. అప్పుడు పనిచేసిన పోలీసులు అధికారులు, దాతల సహాయంతో నిలిచిపోయిన అన్నా క్యాంటీన్‌ను రీమోడలింగ్ చేసి అప్పటి జిల్లా పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రారంభించారు.

పోలీసు శాఖకు నరసాపురంలో శాశ్వత బిల్డింగ్ లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. మొగల్తూరు రోడ్డు సబ్ కలెక్టర్ కార్యాలయంకు ఆనుకుని పట్టణ పోలీసు స్టేషన్, రూరల్ సర్కిల్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన తరువాత వాటిని తొలగించారు. ఆ తర్వాత ప్రహరీ నిర్మించేటప్పుడు స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎవరికి వారు ఈ స్థలం మాది అంటే మాది అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి పోలీసు శాఖకు పట్టణ పోలీసు స్టేషన్, రూరల్ సర్కిల్ కార్యాలయాలు నిర్మించాలని పోలీస్ సిబ్బంది కోరుకుంటున్నారు. ఇప్పటికే మున్సిపల్ అధికారులు పోలీసు శాఖకు అన్నా క్యాంటీన్ భవనంలో నిర్వహిస్తున్న రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సిందిగా ఈనెల 14వ తేదీ శుక్రవారం నోటీసులు అందజేసింది. ఇప్పటికిప్పుడు రూరల్ సర్కిల్ కార్యాలయం ఎక్కడికి తరలించాలని పోలీసులు ఆలోచిస్తున్నారు.

నరసాపురం అభివృద్ధికి సహకరించాలి

ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షులు విఎంఎల్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ను ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షులు, నాయకులు అనంతపల్లి విఎంఎల్ నాగేశ్వరరావు(బాబు) కోరారు. శనివారం సాయంత్రం నరసాపురంలోని నాయకర్ కార్యాలయంలో ఆయన్ని కలిసి మధురై నుంచి ప్రత్యేకంగా తెప్పించిన యాలకుల దండతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతమైన నరసాపురం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట జనసేన నాయకులు నిప్పులేటి తారక రామారావు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఉన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎంపీ అప్పలనాయుడు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మావుళ్లమ్మని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ ఎంఎల్‌సి చైతన్య రాజు శనివారం దర్శించుకున్నారు. వాళ్లను ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

29న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29 (4వ శనివారం) తాడేపల్లిగూడెం కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి సికిందర్ భాష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, అన్ని సివిల్ తగాదాలు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, లిటిగేషన్ బ్యాంక్, బిఎస్ఎన్ఎల్ కేసులు, వగైరా ఇరు పక్షాల మధ్య రాజీ కుదిర్చి పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగ పరచుకోవాలని జిల్లా జడ్జి షేక్ భాష తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర


మొక్కలు నాటుతున్న సభ్యులు

మానవత సంస్థ చేస్తున్న పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణం పరిరక్షణ కోసం శనివారం మార్టేరులోని శ్రీవేణుగోపాల జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల మానవతా అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, కార్యదర్శి బండి ప్రసాద్, కోశాధికారి శ్రీనివాసుల మురళీకృష్ణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
E.P. No. 132/2019 in
O.S. No. 170/2019
Between:
1) Undrajavarapu Yohan
2) Undrajavarapu Surya Jaya Kumar
3) Undrajavarapu Pawan Kumar
...2nd and 3rd DHR were added as per LRS
...DHRs
AND
Gandikota Sudana Rao (died) and Others ...JDRs
JDR-2: Gandikota Mani, W/o. late Gandikota Sudana Rao, Hindu, aged 53 years, R/o. D.No. 2-11-3, Vengaigudem, Eluru.
JDR-3: Gandikota Teja, D/o. late Gandikota Sudana Rao, -do-, -do-
JDR-4: Gandikota Komali, D/o. late Gandikota Sudana Rao, -do-, -do-
...2 to 4 are legal hairs /JDRs
పై నెంబరు గ్రంథంలో చనిపోయిన గండికోట సుదనరావు వారసులు అయిన 2 టు 4 జెడిఆర్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 25-6-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు గ్రంథంను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 14-6-2024
జి.శ్రీనివాసరావు
అడ్వకేట్, రాజమండ్రి

CHANGE OF NAME
I, **GOTTUMUKKALA SRIDEVI** W/o. Sayyaparaju Bhaskara Varma D.No. 3-105, Near Sivalayam Lankalakoderu, Palakollu Mandal, W.G.Dt. A.P. I have changed my name from **SAYYAPARAJU SRIDEVI** (Old name) to **GOTTUMUKKALA SRIDEVI** (New name) hence forth I am being called **GOTTUMUKKALA SRIDEVI** W/o. Sayyaparaju Bhaskara Varma for all purposes.

పేరు మార్పు ప్రకటన
కేతా లక్ష్మి (కొత్తపేరు) భర్త కేతా వెంకటేశ్వరరావు గతంలో నా పేరు వేంద్ర అచ్చుతవల్లి (పాతపేరు) తండ్రి వేంద్ర అప్పారావు, డోర్‌నెం.37-27 రామాలయం వీధి, వంకతాళ్ళ చెరువు, ఆచంట మండలం, ఆచంట, పశ్చిమ గోదావరి జిల్లా. ఆంధ్రప్రదేశ్ నందు నివశించుచున్నాను. ఇప్పుడు నా పేరును వేంద్ర అచ్చుతవల్లి (పాతపేరు) తండ్రి వేంద్ర అప్పారావు నుండి కేతా లక్ష్మి (కొత్తపేరు) W/o. కేతా వెంకటేశ్వరరావుగా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.
కేతా లక్ష్మి, భర్త : కేతా వెంకటేశ్వరావు
డోర్‌నెం.37-27, ఆచంట, పశ్చిమ గోదావరి జిల్లా.
సెల్: 9989329279